క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ అన్నారు. మండలంలోని నాగులవలస, కొత్తపెంట గ్రామాల్లో రోగులకు వైద్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. మురుగు నీరు నిల్వ ఉంటే డెంగీ, మలేరియాతో పాటు అతిసార వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం నియమించిన ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో పని చేస్తున్న సిబ్బంది ద్వారా సమాచారం తీసుకుని సకాలంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గుణపూరి భవానీ, ఎంఎల్‌హెచ్‌పీ ఆశపు సుభాషిని, ఆశ కార్యకర్తలు రమాదేవి, మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: కెరీర్ ఫెయిర్, సిక్కోలు ఫ్యూచర్ సింగర్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని చైతన్య జూనియర్ కళాశాల భవనంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు సాయిబాబా ఆధ్వర్యంలో గాయకులు మార్గదర్శి శ్రీను, కేఎల్ఎన్‌మూర్తి, డాక్టర్ ప్రదీప్, కూర్మారావు, కూన అనిల్, సూపర్ సింగర్ వెంకటేష్, లక్ష్మి, హరిప్రసాద్, భోగెల ఉమామహేశ్వరరావు, శిరీష, లావణ్య, సూర్యప్రకాష్, ఉష, తేజ లక్ష్మిలు ఘంటసాల గీతాలను ఆలపించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అంతర పంటలకు ప్రాధాన్యమివ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల సాగుకు ప్రాధాన్యతమివ్వాలని రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయరావు అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఐదు రోజుల శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో మూడోరోజు బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట సాగు చేసి, అందులో కనీసం ఆరు అంతర పంటలు వేయాలని సూచించారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉన్న వసతి గృహాల చుట్టూ పేరుకుపోయిన మురుగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.వి.ప్రసాద్‌కి వినతిపత్రం బుధవారం అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న నాలుగు వసతి గృహాల నందు పేరుకుపోయిన మురుగునీటి వలన, అక్కడ చదువుతున్న ఎనిమిది వందల మంది విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్స్‌లో దోమలు నియంత్రించేందుకు ప్రభుత్వం ఎటువంటి చొరవ తీసుకోవడం లేదన్నారు. వినతి పత్రం అందించినవారిలో మహిళా కో–కన్వీనర్ దివ్య, ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. ఆదర్శనీయం..!



జి.సిగడాంలో ఆహ్లాదకరంగా ఉన్న వసతిగృహం

- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న జి.సిగడాం వసతి గృహం
- ప్రతిఏటా శతశాతం ఉత్తీర్ణత
- విద్యార్థులకు మౌలిక సదుపాయాలు

జి.సిగడాం: మండల కేంద్రంలోని వసతి గృహం సౌకర్యాలతో పాటు చదువులోనూ ఆదర్శనీయంగా నిలుస్తోంది. ఇక్కడి విద్యార్థులు ప్రతిఏటా ఉత్తమ ఫలితాలను మాత్రమే కాకుండా శతశాతం ఉత్తీర్ణత సాధిస్తుండడం విశేషం. ఒక పక్క క్రీడలు, యోగా, ఇతర కార్యక్రమాలతో పాటు చదువుల్లో ఉత్తమంగా రాణించి జిల్లాస్థాయిలోనే మంచి ఫలితాలను సాధిస్తున్నారు. దీంతో పలువురి అధికారులు, రాజకీయ నాయకుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఇక్కడ వసతి గృహం అధికారిగా పనిచేస్తున్న లోలుగు నూకరాజు ఇప్పటికే పలు అవార్డులు కూడా అందుకోవడం విశేషం.

ఇంటిని మరిపించేలా..

ఇంటిని విడిచిపెట్టి చదువుకోవడానికి ఈ వసతి గృహానికి వచ్చే విద్యార్థులకు ఇక్కడి సౌకర్యాలు ఇంటిని మరిపించేవిధంగా ఉంటాయి. అలాగే వసతి గృహం గోడలను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. గదులు, వరండాలో గోడలపై వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు, శాస్త్రవేత్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధుల చిత్రాలను వేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోయినా వసతి గృహం అధికారి నూకరాజు సొంత నిధులతో ఈ పనులు చేపట్టారు.

అధికారుల అభినందనలు

వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పదో తరగతిలో శతశాతం ఉత్తర్ణీత సాధించడం, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధిస్తుండడంతో పలువురు అధికారులు, నాయకులు అభినందనలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, డీఈవో తిరుమల చైతన్య సందర్శించి వార్డెన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



వరండాలో చదువుతున్న విద్యార్థులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో తిరుమల చైతన్య(ఫైల్)

ఇంటి దగ్గర కంటే బాగుంటుంది



మాది చాలా పేద కుటుంబ. మా నాన్న, అమ్మ కలిసి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాకు చదువుకోవాలని ఆసక్తి ఉంది. నేను ఈ వసతి గృహంలో ఉండి చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్నారు. మా ఇంటి దగ్గర కూడా ఇలాంటి సదుపాయాలు ఉండవు.

– బాలి లోకేష్,
విద్యార్థి, జి.సిగడాం వసతి గృహం

దేవాలయంలా ఉంటుంది



స్థానిక జెడ్పీ పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్నాను. మాది విజయనగరం జిల్లా రాజాం మండలం దోసరి గ్రామం. మా నాన్న, అమ్మ వ్యవసాయ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రసుత్తం వసతి గృహంలో ఉంటూ చదువుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతిరోజూ ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు, రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలను సాధిస్తాం.

– కుర్మాన శ్రీరామ్,
విద్యార్థి, జి.సిగడాం వసతి గృహం

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



వసతి గృహంలో ఉన్న విద్యార్థుల ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తాం. వసతి గృహంలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటున్నాం. నాకు ఇంటి కంటే వసతి గృహమే దేవాలయంగా భావించుకుంటున్నాను. ఇక్కడ చదువుతున్న విద్యార్థులంతా పేదవారే. వారికి నాణ్యమైన విద్య, భోజనంలో ఎక్కడా తేడా ఉండదు. డీఈవో తిరుమల చైతన్య ఇటీవల ఆకస్మికంగా వచ్చి మా వసతి గృహంలో బస చేశారు. పిల్లలతో నేరుగా కలిసి భోజనం చేశారు. నాకు ఎంతో ఆనందంగా ఉంది.

– లోలుగు నూకరాజు,
వార్డెన్, జి.సిగడాం

కంచె పంటగా బంతి



మిరప, వంగ తదితర పంటల సాగులో రైతులు కంచె పంటగా బంతి సాగు చేస్తున్నారు. బంతి సాగు వలన ఆదాయంతో పాటు, పురుగులు పంటలోకి రాకుండా కొంతమేరకు మొక్కలు అడ్డుకుంటాయని రైతులు పేర్కొంటున్నారు. మిత్ర పురుగులకు రక్షణగా నిలుస్తాయని, శత్రు పురుగుల నుంచి రక్షణ కల్పిస్తాయని చెబుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

అవగాహన



మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశలోనే అవగాహన ఉండాలని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంతోష్ అన్నారు. బుధవారం బలగ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు 'సంకల్పం' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన ముఖ్యమన్నారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సమావేశంలో హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

– శ్రీకాకుళం:

ఆర్థిక సాయం



శ్రీకాకుళం నగరంలోని గుజరాతిపేట తోటవీధిలో నివాసముంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన తరిగొప్పుల రాజేశ్వరికి స్థానికులు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. రాజేశ్వరి భర్త ఇటీవల మరణించడంతో ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో పార్నంది విజయకుమార్, ద్విభాష్యం అనంతకుమార్, వారణాసి శేఖర్, కృష్ణకుమార్, అంధవరపు సంతోష్, ప్రసాద్, మల్లా కల్యాణ్‌చక్రవర్తి, పన్నాల నరసింహమూర్తి, భార్గవ, రవికుమార్, శ్రీనివాసరావు, సన్యాసిరావు, శ్రీనుస్వామి, పెంట శ్రీధర్, తుమరాడ సంతోష్, కార్తిక్, మూర్తి, భాస్కరరావు, శ్రీను, డి.వెంకటరమణ, వి.వేణు, తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

దళారులను నమ్మవద్దు



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: ధాన్యం కొనుగోలులో రైతులు దళారులను నమ్మవద్దని, ప్రభుత్వమే రైతు వద్దకు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించే ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయడం ఎంతో అదృష్టమన్నారు. దళారుల లేకుండా నేరుగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. సచివాలయాల సిబ్బంది పక్కాగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత, నాయకులు మక్క నారాయణరావు, కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, వజ్జిపత్తి రఘురాం, భూపతి అర్జుననాయుడు, పడాల అప్పన్న, మీసాల రమణ, మీసాల విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏవో వై.శారద, అక్కలనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు తలచింతల కుసుమ, అలుగోలు లక్ష్మీనారాయణ, కుమరాపు సుగుణకరావు, ముంతా హేమంత్‌కుమార్, బి.రాణి, అంపోలు అనూష, సత్యనారాయణ, సింహాద్రి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఇబ్రహింబాద్ రైతు సేవా కేంద్రంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కనీస మద్దతు ధర రూ.2,300 పొందాలని సూచించారు. అనంతరం మినప విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ భవానీ శంకర్, ఏడీ రజినీ, ఎంపీడీవో హరిహరరావు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి'



మాట్లాడుతున్న గాదం వెంకట త్రినాథరావు

శ్రీకాకుళం అర్బన్:

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి షర్మిలారెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో పత్రికా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారం చేపట్టిన తర్వాత ప్రజల నడ్డివిరిచే విధంగా విద్యుత్ భారాన్ని మోపడం చాలా దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరలను ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామం బెల్ట్ షాపులతో నిండిపోయిందని దుయ్యబట్టారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, మామిడి సత్యనారాయణ, బొత్స వెంకటరమణ, మజ్జి మురళీమోహన్, రాష్ట్ర ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదన్‌రావు, అనుపోజి రవికుమార్, అంబటి లక్ష్మణరావు, బొగ్గ రాము తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు ప్రాధాన్యమివ్వాలి

రణస్థలం: బాలికల రక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల స్థాయి కిశోరి వికాసం కార్యక్రమంపై హైస్కూల్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్‌కు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు చదువుతో పాటు ఆరోగ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్ ఝూన్సీబాయి, ఏవో ధనుంజయరావు, ఎంఈవో త్రినాథరావు, మెడికల్ అధికారి బీవీపీ అనూష, మండల రిసోర్స్ పర్సన్స్ నారాయణమూర్తి, కె.గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

గార: కౌమర దశ బాలలకు సరైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ ఎస్.రమణారావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో రాధా మాధవి ఆధ్వర్యంలో కిషోరి వికాసం పేరిట మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్లు నిర్వహణ కోసం ఈ కోత విధిస్తున్నట్లు చెప్పారు. ఫరీదుపేట, లింగాలపేట, ఎస్ఎంపురం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు. వినియోగదారుల సహకరించాలన్నారు.

వన్య ప్రాణులను సంరక్షించాలి



విద్యార్థులకు వ్యక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ప్రతి ఒక్కరూ వన్య ప్రాణులను సంరక్షించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాల్సి ఉందని ఏపీ ఎన్‌జీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావు తెలిపారు. మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణ సంరక్షణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు, వాటి నివాసాలను పరిరక్షించాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. వేట, నివాస నష్టం, ముప్పుల ద్వారా అనేక జాతులు ప్రమాదంలో పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలతో పర్యావరణాన్ని కలుపుతూ వన్యప్రాణి సంరక్షణలో డిజిటల్ ఆవిష్కరణల అన్వేషణ, ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్స్, కృత్రిమ మేధస్సు వంటి డిజిటల్ పరికరాలు వన్యప్రాణుల పర్యవేక్షణ, జాతుల ట్రాకింగ్, అక్రమ కార్యకలాపాలు అడ్డుకోవడంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తృత్వ పోటీలను నిర్వహించారు.

సీడ్ బాల్స్ తయారీ



సీడ్ బాల్స్‌తో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు సీడ్ బాల్స్‌ను బుధవారం తయారు చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన రాష్ట్ర వ్యవసాయ విభాగ కో–ఆర్డినేటర్ దార్లపూడి రవి నేతృత్వంలో సుమారు 300 మంది విద్యార్థులు 4,500 పైగా నాణ్యమైన సీడ్ బాల్స్ తయారు చేశారు. వీటిని రానున్న రోజుల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు అడవుల్లో, చెట్లు లేని ప్రదేశాల్లోను విసురుతారని, వర్షాలు కురిశాక అవి మొక్కలుగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని రవి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త త్రివిక్రమ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి సురేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

జి.సిగడాం: గ్రామాల్లోని రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రబీలో రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసేందుకు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. వన్–బీ రాకపోతే తక్షణమే వీఆర్వోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సిమ్మన్నకు డాక్టరేట్



సిమ్మన్నకు డాక్టరేట్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలోని బయోటెక్నాలజీ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన నక్క శిమ్మన్నకు బుధవారం వీసీ కె.ఆర్.రజిని డాక్టరేట్ పట్టా అందజేశారు. బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షణలో ఈయన డాక్టరేట్ చేశారు. లవణీయతను తట్టుకొని మొక్కల పెరుగుదలను ప్రోత్సహించే రైజోబియం బాక్టీరియాపై అధ్యయనం చేశారు. ప్రస్తుతం ఈయన భారత ఆహార సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

వెచ్చని నేస్తాలు వచ్చేశాయి..!











శీతాకాలంలో వెచ్చదనాన్నిచ్చే నేస్తాలు వచ్చేశాయి. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతతో నగరంలో ఉన్ని దుస్తుల అమ్మకాలు పెరిగాయి. స్వెటర్లు, జర్కిన్లు, శాలువాలు, టోపీలపై ప్రజలు ఆసక్తి చూపిస్తుండడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ముఖ్యంగా రాజస్థాన్ ప్రాంతానికి చెందిన వ్యాపారులు పెట్టిన దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం